క్లుప్తంగా

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

పుట్టపర్తి టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు తీర్చాలని కోరుతూ గురువారం రెండో రోజు సీఐటీయూ ఆధ్వర్యంలో హనుమాన్ కూడలి వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 36 ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు. హెల్త్, రిస్క్ అలెవెన్సులు అమలు చేయాలని, ఆప్కాస్ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్, మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామయ్య, నరసింహులు, కేశవ, రమణ, రాందాస్, బెస్త గంగాధర్, గణేష్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్

కదిరి అర్బన్: కొండమనాయునిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం శక్తి టీమ్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. శక్తి యాప్, బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్, మహిళా వేధింపులకు సంబంధించి చట్టాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో శక్తి బృంద సభ్యులు మంజుల, సౌభాగ్య, తాజుద్దీన్, షాకత్‌ఖాన్, చలపతి, పాఠశాల హెచ్‌ఎం స్వరూపరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం నిరవధిక వాయిదా

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 25న జరగాల్సి ఉంది. అయితే మండల ప్రాదేశిక సభ్యులు హాజరు కాకపోవడంతో గురువారానికి వాయిదా పడింది. తిరిగి గురువారం కూడా సభ్యులు హాజరుకాకపోవడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ బాలక్రిష్ణుడు తెలిపారు. తిరిగి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మూడు నెలలకు నిర్వహిస్తామని వెల్లడించారు.

కూష్మాండ దీపోత్సవం



ప్రత్యేక అలంకరణలో కాలభైరవస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీ చక్రవర్తి థియేటర్ ఎదురుగానున్న స్వయంభు కాలభైరవస్వామి ఆలయంలో గురువారం అమావాస్య గడియల్లో కూష్మాండ దీపోత్సవాన్ని నిర్వహించారు. పూజారి ధనుంజయ ఆచారి అమావాస్య గడియల్లో దోష నివారణ పూజలు చేశారు. అనంతరం కాలభైరవస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భైరవస్వామి ఎదుట గుమ్మడికాయపై దీపాలు వెలిగించి పూజలు చేపట్టారు. భక్తులకు కంకణ ధారణ చేశారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్డుకు అడ్డంగా వేసిన మెట్ల తొలగింపు



ప్రైవేటు బస్టాండ్ సమీపంలో అక్రమంగా ఏర్పాటు చేసిన మెట్లు తొలగించిన దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణ ప్రైవేట్ బస్టాండ్ సమీపంలో విశాల్ బిల్డింగ్ వద్ద రహదారిపై రోడ్డుకు అడ్డంగా వేసిన మెట్లు తొలగించారు. రోడ్డుకు అడ్డంగా ఇనుప మెట్లు ఏర్పాటు చేసి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులు గురువారం స్పందించారు. మూడు రోజుల క్రితం గుట్టు చప్పుడు కాకుండా రాత్రి వేళలో నిత్యం రద్దీగా ఉండే రహదారిపై ఇనుప మెట్లు ఏర్పాటు చేసి, ప్రజలకు అసౌకర్యం కల్పిస్తున్నారని ప్రజలు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కు ఫిర్యాదు చేశారు. వెంటనే రహదారిపై ఏర్పాటు చేసిన ఇనుపమెట్ల తొలగింపజేసి రాకపోకలకు సౌకర్యం కల్పించారు.

అన్నదాత సుఖీభవ
ఆశలు గల్లంతు!



ఈ-కేవైసీ కోసం తాడిమర్రిలోని రైతు సేవా కేంద్రానికి వచ్చిన రైతులు

- రైతు సేవా కేంద్రాల్లో అర్హుల జాబితా
- జాబితాలో పేర్లులేక రైతుల ఆందోళన
- రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ



తాడిమర్రి: ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకంటూ ప్రకటించిన అన్నదాత సుఖీభవపై రైతుల ఆశలు గల్లంతవుతున్నాయి. ఇటీవల సచివాలయం పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా ప్రకటించారు. అయితే అందులో సగానికి పైగా రైతుల పేర్లు లేవు. జాబితా పేర్లు లేకపోతే పథకం అందంటూ ప్రచారం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతి 4 నెలలకోసారి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి రూ.2,000 నిధులతో కలుపుకొని రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క రైతుకు ఏడాదికి రూ.20 వేలు అందిస్తామంటోంది. అయితే మొదటి విడతలో రూ.7 వేలు జూన్ మూడో వారంలో ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

ఈకేవైసీ పూర్తయ్యేదెన్నడు?

వ్యవసాయ సిబ్బంది గత నెల నుంచే రైతులతో ఈ-కేవైసీ వేయించుకునే పనిలో నిమగ్నమయ్యారు. అయినా 50 శాతం కూడా పూర్తయినట్లు కనిపించడం లేదు. దీంతో రైతులు ఈ-కేవైసీ కోసం రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని తాడిమర్రి మండలంలో 7,029 మంది రైతులు ఉన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో భూముల రీసర్వే జరుగుతోంది. గతంలో పూర్వీకుల (తాతముత్తాల) పేర్లమీద భూమి ఎంత ఉంటే అంతేభూమి వారి కుటుంబ సభ్యుల అందరిపై చూపుతోంది. తాడిమర్రి మండల కేంద్రంలో పదుల సంఖ్యలో రైతుల పేరున వారికున్న అసలైన భూమి కంటే చాలా మంది రైతుల పేరున 327 ఎకరాలు ఉన్నట్లు చూపుతోంది. దీంతో వారందరి పేర్లు అన్నదాత సుఖీభవ జాబితాలో లేవు. దీంతో డబ్బులు వస్తాయో రాదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈ-కేవైసీ చేయలేదంటున్నారు...



మా గ్రామంలో నా పేరున 2.50 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆరేళ్ల క్రితం 350 చీనీ మొక్కలు నాటాను. ప్రస్తుతం చెట్లు కాపు మీదున్నాయి. అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా తాడిమర్రి రైతు సేవా కేంద్రంలో అతికించారని తెలిసి వచ్చా. ఎంత వెతికినా నా పేరు కనిపించలేదు. వ్యవసాయ అధికారులను అడిగితే నీవు ఈ-కేవైసీ చేయలేదంటున్నారు. ఇప్పుడు ఈ-కేవైసీ వేస్తే అన్నదాత సుఖీభవ వస్తుందా రాదా అర్థం కావడం లేదు.

-సాకే చిన్న కుళ్లాయప్ప, మోదుగులకుంట, తాడిమర్రి

పథకంపై స్పష్టత లేదు



అన్నదాత సుఖీభవ పథకంపై స్పష్టత లేదు. గతంలో ఈ-కేవైసీ తీసుకుంటామని చెప్పడంతో తాడిమర్రికి వచ్చి ఈ-కేవైసీ చేయించా. ఇప్పుడు అధికారులు అందించిన అర్హుల జాబితాలో పేరు లేదు. ఇదేమని సిబ్బందిని అడిగితే నీపేరుపై 10 ఎకరాలకు మించి భూమి ఉన్నందున నీ కుటుంబానికి అన్నదాత సుఖీభవ రాదంటున్నారు. అయితే నాకు, నా భార్యకు కలిసి 6.50 ఎకరాల భూమి మాత్రమే ఉంది.

-మల్లికార్జునరెడ్డి, పెద్దకోట్ల, తాడిమర్రి

అర్హులందరికీ పథకం



అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ అందిస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇప్పుడు రైతు సేవా కేంద్రాల్లో అతికించిన జాబితా ఫైనల్ కాదు. ఈ-కేవైసీ పూర్తి చేసుకుని ఆ పథకానికి అర్హత పొందిన వారు మాత్రమే. జాబితాలో పేర్లులేని వారు వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ఈ-కేవైసీ చేయించుకోవాలి. కుటుంబంలోని భార్య, భర్తల పేరున పదెకరాలకు పైగా భూమి ఉన్నా పథకం వర్తిస్తుంది.

-హెచ్.శేఖర్ నాయక్, ఏఓ, తాడిమర్రి

ప్రణాళికాబద్ధంగా తండాల అభివృద్ధి



తండాలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తనకల్లు: తండాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని ఎంపీడీఓ రామానాయక్ అన్నారు. ముండ్లవారిపల్లి తండాలో గురువారం ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కింద దేవళంతండా (ముండ్లవారిపల్లితండా) ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా తండాలో అన్ని రకాల మౌళిక వసతులను కల్పిస్తామన్నారు. అనంతరం తండా వాసులతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

గాండ్లపెంట: స్థానిక ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మాధవీలత, రమేష్‌ను ఎంఈఓలు కృష్ణానాయక్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో సహచర ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు.

నేటి నుంచి దస్తగిరి, వన్నూరుస్వామి బ్రహ్మోత్సవాలు



కనగానపల్లిలో మొహర్రం ఉత్సవాలు జరిగే దస్తగిరిస్వామి పీర్లచావిడి, ఆంజనేయస్వామి ఆలయ ఆవరణ (ఫైల్)

కనగానపల్లి: మండల కేంద్రం కనగానపల్లిలో శుక్రవారం నుంచి దస్తగిరి, వన్నూరుస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. గ్రామాల్లో మతసామరస్యానికి ప్రతీకగా మొహర్రం ఉత్సవాలను ప్రజలు ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. హిందూ, ముస్లింలు కలిసి ఐక్యంగా జరుపుకొనే మొహర్రం పండుగను సుమారు వారం రోజుల పాటు ప్రజలు ఆనందోత్సాహాలతో నిర్వహిస్తారు. మండల కేంద్రం కనగానపల్లితో పాటు తగరకుంట, యలకుంట్ల, కోనాపురం, మామిళ్లపల్లి, ముక్తాపురం గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. కనగానపల్లిలో దస్తగిరి, కుళ్లాయి, వన్నూరుస్వాముల బ్రహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. గ్రామంలోని దస్తగిరిస్వామి పీర్లచావిడి, ఆంజనేయస్వామి ఆలయాల ముందు ఉన్న ఆవరణలో జరుగుతాయి. చుట్టు పక్కల గ్రామస్తులతో పాటు కర్నూలు, కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల నుంచి కూడా వందల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శుక్రవారం జెండా ఆవిష్కరణ. పీర్లస్వాముల ప్రథమ దర్శనం ఉంటుంది. ఇక జులై 1వ తేదీ మంగళవారం గంధపూజ, పెట్టిమెరవని కార్యక్రమాలు ఉంటాయి. 2వ తేదీ బుధవారం పీర్లస్వాములను చావిడిలో కొలువుదీర్చి నిత్యపూజలు ప్రారంభిస్తారు. ఆదేరోజు నుంచి గ్రామస్తుల, భక్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపడతారు. 4వ తేదీ చిన్న సెరిగెత్తు కార్యక్రమం, 5న విడిదినం, 6న పెద్ద సరిగెత్తుతో పాటు స్వామివారికి పానకాలు, గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇక 7వ తేదీ సోమవారం పీర్ల స్వాములను అగ్నిగుండ ప్రవేశం చేయించి జలధి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న ఆర్డీఓ మహేష్

బత్తలపల్లి: రామాపురం సమీపంలోని చిత్రావతి నదిలో అక్రమంగా ఇసుక త్రవ్వకాలు, రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ధర్మవరం ఆర్డీఓ మహేష్ పేర్కొన్నారు. గురువారం ఉదయం తహసీల్దార్ స్వర్ణలతతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, జేసీబీని గుర్తించి భారీ జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ నియమాలను ఉల్లఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుకను ప్రభుత్వం కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే సేకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ ఘటనపై పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. ఈ తరహా ఘటనలు పునరావృతం అయితే మైన్స్ అండ్ మినరల్స్(డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ఇసుక తవ్వకాలపై పోలీస్ శాఖ, గనుల శాఖకు తగిన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రజలందరూ ఇసుక అక్రమ తరలింపుపై అధికారుల దృష్టికి తీసుకురావాల కోరారు.

జీవాలకు నట్టల నివారణ మందులు తాపించండి



గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న ఏడీ శ్రీనివాసులు

బత్తలపల్లి: జీవాలకు నట్టల నివారణ మందులు తాపించాలని ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం బత్తలపల్లిలోని జీవాలకు ఉచితంగా డీవార్మింగ్ మందులను తాపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల మందల దగ్గరకే పశువైద్య సిబ్బంది వెళ్లి అన్నింటికి మందులు తాపిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని గొర్రెల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గొర్రెల్లో, మేకల్లో నట్టల నివారణ వల్ల జీవాల ఆరోగ్యం మెరుగుపరుస్తుందన్నారు. నట్టల నివారణ మందులు వాడటం వలన మరణాల రేటు తగ్గడంతో పాటు మాంసోత్పత్తి పెరుగుతుందని, ఆర్థిక నష్టాలు తగ్గుతాయన్నారు. పశువైద్య సిబ్బంది సురేష్, మారుతి, రాము పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ

పెనుకొండ: గొర్రెలు, మేకల కాపరులు నట్టల నివారణ మందు వేయించుకుని జీవాలు అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీరాములు నాయక్ సూచించారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కోనాపురంలో గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వేశారు. ఏడీ మాట్లాడుతూ వర్షాకాలంలో గొర్రెలు, మేకలు జబ్బుల బారిన పడే ప్రమాదం ఉందని, నట్టల నివారణ మందును వేయడం ద్వారా రోగులు సోకవన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మహేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు జమ చేయాలి



ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్‌లు

నల్లమాడ: 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీల బ్యాంక్ ఖాతాలకు వెంటనే జమ చేయాలని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు కోరారు. గురువారం మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి అధ్యక్షతన మండల మీట్ జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు అందకపోవడంతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కూడా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. క్లాప్ మిత్రల వేతనాలను గతంలో కేంద్రం అందించేదని, ప్రస్తుతం ఆ భారం కూడా గ్రామ పంచాయతీలపై మోపడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందన్నారు. జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, సర్పంచ్‌లు లింగమూర్తి, కుళ్లాయప్ప, ప్రసాద్, బొజ్జేనాయక్, ఆనంద్ నాయక్, నాయకులు ఎస్. రాంమోహన్‌రెడ్డి, నాగరాజునాయుడు, మూర్తి, ఎంపీటీసీ మహబూబ్‌బాషా, మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రసూల్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత ఏపీగా మార్చేందుకు కృషి



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



కరపత్రాలు విడుదల చేస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్



చెన్నేకొత్తపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ సురేష్‌బాబు, టూ టౌన్, రూరల్, ముదిగుబ్బ సీఐలు రెడ్డెప్ప, ప్రభాకర్, శ్యామ్‌రావు, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ చంద్రమణి, ఎంఈఓ గోపాల్‌నాయక్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి పేర్కొన్నారు. పట్టణంలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాల తయారీ, రవాణా, విక్రయం చట్టరీత్యా నేరమన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని సూచించారు. ఎక్సైజ్ ఎస్‌ఐలు నాగరాజు, వీఆర్వోలు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

డ్రగ్స్ నుంచి యువతను కాపాడుకోవడం ఎలా అని ప్రజలకు అర్థమయ్యేలా కరపత్రాలు రూపొందించడం హర్షణీయమని డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం స్పందన ఆసుపత్రి వ్యవస్థాపకులు వైద్యులు టీఎం బషీర్ రూపొందించిన డ్రగ్స్ నుంచి యువతను కాపాడుకోవడం ఎలా అనే కరపత్రాలను డీఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం యువత మత్తుకు ఎక్కువగా ఆకర్షణకు లోనవుతున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తుండాలని సూచించారు. స్పందన ఆసుపత్రి వైద్యులు, మేనేజర్ బాబా, సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి అర్బన్: అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ ప్రజలందరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలనాన్నారు. డీఎస్పీ శివనారాయణస్వామి, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌తో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరకోవాలని ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బందితో కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. అలాగే ఏపీ మోడల్ స్కూల్‌లో చెన్నేకొత్తపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, రామగిరి సీఐ శ్రీధర్, చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ స్వర్ణలత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నేత మృతి



కుళ్లాయప్ప మృతదేహానికి పూలమాలలు వేస్తున్న నేతలు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం కొండాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొత్తకోట కేశప్ప, మాజీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని కుళ్లాయప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. సచివాలయాల కన్వీనర్ గోవింద రెడ్డి, మాజీ ఎంపీటీసీ రంగారెడ్డి, పతంజలి, ఏలూరు ఈశ్వర్, మారాల సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు పాముదుర్తి విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురంలో పోలీసుల నాకాబందీ



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ ప్రభాకర్

ధర్మవరం రూరల్: మల్కాపురం గ్రామంలో గురువారం ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో నాకాబందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లతో పాటు గడ్డివాములు, పాడుబడిన ఇళ్లలో సోదాలు చేపట్టారు. అనంతరం గ్రామ సభను ఏర్పాటు చేసి త్వరలో జరగబోయే మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ సూచించారు. సైబర్ నేరాలు, మద్యపానంతో కలిగే అనర్థాలు, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. ధర్మవరం రూరల్, బత్తలపల్లి ఎస్ఐలు శ్రీనివాసులు, సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం

గాండ్లపెంట: అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కదిరి ఎన్‌జీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గాండ్లపెంట మండలాధ్యక్షుడు పామిడి మహమ్మద్‌రఫీ గురువారం తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితులందరూ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నూతన ఏడీఏగా సనావుల్లా



కదిరి అర్బన్: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ కార్యాలయంలో నూతన ఏడీఏగా సనావుల్లా గురువారం బాధ్యతలు స్వీకరించారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఆయన పేర్కొన్నారు.

టికెట్ కౌంటర్ ప్రారంభం

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి రైల్వే స్టేషన్‌లో టికెట్ కౌంటర్‌ను రైల్వే శాఖ అధికారులు గురువారం ప్రారంభించారు. బెంగళూరు, అనంతపురం వైపు వెళ్లే ప్యాసింజర్ రైళ్లకు టికెట్లు ప్రయాణికులకు ఇస్తామని కౌంటర్ నిర్వాహకుడు మంజు తెలిపారు. రైలు వచ్చే అరగంట ముందు ప్రయాణికులు స్టేషన్‌లో టికెట్లు తీసుకోవచ్చన్నారు.

టేకులోడు విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు

చిలమత్తూరు: మండలంలోని టేకులోడు క్రాస్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ఐఐఐటీలో సత్తాచాటారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థినులు పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించి, ఐఐఐటీలో సీట్లు సాధించారన్నారు. ఆర్. స్పందన, జి. హేమాబాయి నూజివీడు ట్రిపుల్ ఐటీలో, భానుశ్రీ, కీర్తన ఒంగోలులోని ఆర్కే వ్యాలీలో సీట్లు సాధించారన్నారు. అదేవిధంగా ఎస్ఎస్‌వైవీఎన్ పాఠశాల విద్యార్థిని ప్రీతిబాయి శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

గ్రామాల్లో సాయిభక్తుల భిక్షాటన

మడకశిర: నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో సాయి భక్తులు భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం మడకశిర మండలంలోని వివిధ గ్రామాల్లో కార్యక్రమం చేపట్టారు. వచ్చేనెల 9,10వ తేదీల్లో పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో పెద్ద ఎత్తున గురుపౌర్ణమి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగనున్నాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో ఆలయ కమిటీ చైర్మన్, విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు భిక్షాటన చేసి ధన, వస్తు రూపేణా ప్రజల నుంచి సాయాన్ని తీసుకుంటున్నారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.